క్లుప్తంగా

ఇనుగుర్తి అనిల్‌కుమార్‌కు పీహెచ్‌డీ పట్టా



హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన ఇనుగుర్తి అనిల్‌కుమార్‌కు పీహెచ్‌డీ పట్టా లభించింది. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆచార్య సీహెచ్.రాజేశం పర్యవేక్షణలో వాణిజ్యం, వ్యాపార నిర్వహణ విభాగంలో 'భారతదేశంలో సిమెంట్ పరిశ్రమ పనితీరు – తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన యూనిట్ల అధ్యయనం' అనే అంశంపై చేసిన పరిశోధనకు కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు తెలిపారు. దీంతో పట్టణానికి చెందిన పలువురు ఆయనను అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి కర్తవ్యం



డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

పాలకవీడు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి కర్తవ్యం అని మండలంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కార్మికులతో కలిసి పరిశ్రమ పరిసర ప్రాంతాలు, కాలనీ వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఘనుల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 30 వరకు స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీజీఎం నాగమల్లేశ్వరరావు, మైన్స్ జనరల్ మేనేజర్ కళ్యాణ్‌చక్రవర్తి వివిధ విభాగాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు

యాసంగి సాగుకు సాగర్ నీరివ్వాలి

నడిగూడెం : ప్రస్తుత యాసంగి సీజన్ సాగుకు సాగర్ నీరు ఇవ్వాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారాబందీ పద్ధతిలో అయినా సాగు నీరిచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

కోదాడరూరల్ : అక్రమంగా తరలిస్తున్న ఐదు ఆవులను కోదాడ మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు వద్ద గురువారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరువూరు నుంచి డీసీఎంలో హైదరాబాద్‌కు ఆవులను తరలిస్తుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా ఆవులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ఆవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించి డీసీఎం డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాశం చిన్ననారాయణ మృతి తీరని లోటు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురానకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పాశం చిన్ననారాయణ అకాల మృతి పార్టీకి తీరని లోటని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. గురువారం ఆయన నారాయణ మృతదేహంపై కాంగ్రెస్ జెండాను కప్పి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రావు, కౌన్సిలర్ ధనమ్మ జైలు, కారింగుల విజయ వెంకన్న, జక్కుల మల్లయ్య, చింతకాయల రాము, పాశం కోటమ్మ, జ్ఞానయ్య, పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామ శివారులో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన నాగదేవత దేవాలయంలో గురువారం నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆలయంలో హోమం నిర్వహించారు. 17వ తేదీన (శుక్రవారం) ఆలయ ఆవరణలో నాగులచవితిని ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా హోమం, మహా పడిపూజ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ వేనేపల్లి సుగుణమ్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అవినీతి పాలనకు తెరదించాలి

- హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కోదాడ: ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్, పక్కన కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

కోదాడ : కోదాడ నియోజవకర్గం అభివృద్ధి పథంలో ముందుకు పోవాలంటే ప్రస్తుత అరాచక, అవినీతి పాలనకు తెరదించాలని, దీని కోసం అన్ని వర్గాల ప్రజలు సమష్టిగా పని చేయాల్సిన సమయం వచ్చిందని నల్గొండ ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని తమ్మర వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ తొలివారంలో అధికారంలోకి వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగుదేశం నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని



మేళ్లచెరువు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఆయన కోరారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గాలుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అంతకుముందు కోదాడలోని టీడీపీ కార్యాలయం నుంచి తమ్మర వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఏర్నేని బాబు, ముత్తవరపు పాండురంగారావు, ముత్తినేని సైదేశ్వరరావు, నంబూరి సూర్యం, ఉప్పగండ్ల శ్రీను, తొండపు సతీష్, ఉన్నం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలో ముస్లిం కుటుంబాలకు చెందిన పలువురు గురువారం రాత్రి ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయన్నారు. మండల కేంద్రంలో కోటి రూపాయలతో షాదీఖానా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునావర్, అల్తాఫ్ హుస్సేన్, జబ్బార్, అన్వర్, నాగుల్‌మీరా, బాబా, మథార్, వలీ, భాస్కర్‌రెడ్డి, సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

పాలకవీడు : కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. గురువారం ఆయన మండలంలో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచార నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు, మోతీలాల్, జితేందర్‌రెడ్డి, సందీప్, జ్యోతి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని హుజూర్‌నగర్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పోటీలో ఉన్న అభ్యర్థులు రాజకీయ పార్టీల నాయకులతో పట్టణంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పాటించాలని, ప్రచారంలో కుల, మతాల ప్రస్తావనను తీసుకురావద్దని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నైతిక నియమావళి, వ్యయ పర్యవేక్షణ గురించి వివరించారు, అభ్యర్థులకు ఎలాంటి సమస్య ఎదురైనా తమకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ అధికారి ప్రమోద్‌కుమార్, సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారి కౌషిగస్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నాగార్జునరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ ప్రజలకు జీవితాంతం సేవచేస్తా

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



అనంతగిరి : అమీనాబాద్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతి



నడిగూడెం : పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

అనంతగిరి : కోదాడ నియోజకవర్గ ప్రజలకు ఉత్తమ్ పద్మావతిరెడ్డి దంపతులిద్దరం జీవితాంతం సేవ చేస్తామని కోదాడ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అమీనాబాద్, బొజ్జగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అమీనాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తనకు కోదాడ ప్రజలతో విడదీయరాని అనుబంధం ఉందని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తాను మొట్టమొదటి సారిగా కోదాడకు వచ్చినప్పుడు కోదాడ ప్రజలు ఆదరించినది ఇంకా మర్చిపోలేదన్నారు. తాము అధికారంలో ఉన్న రోజుల్లో ప్రజలను ఎప్పుడూ కూడా ఇబ్బందులకు గురి చేయలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజలను వేధిస్తూ డబ్బు దండుకున్నారని ఆరోపించారు. మట్టి, ఇసు క, వైన్స్‌లపై ట్యాక్స్‌ల పేరుతో ప్రజలను హింసించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కు ఎంతో మేలు చేసిందని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనంతగిరి ఎంపీపీగా తనను నియమిస్తానని బొల్లం మల్లయ్యయాదవ్ నమ్మించి రూ.30 లక్షలు తీసుకుని వేరే వ్యక్తికి సహకరించాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గునుకుల గోపాల్‌రెడ్డి, బాణోతు బాబునాయక్, బుర్ర పుల్లారెడ్డి, బుర్ర ప్రమోద్‌రెడ్డి, ఈదుల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి సమక్షంలో చేరికలు

నడిగూడెం : కోదాడ పట్టణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో నడిగూడెంకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, నాయకులు పందిరి వెంకటరెడ్డి, ఎలకా రామిరెడ్డి, గడ్డం మల్లేష్, సుధీర్, పుల్లయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం

కోదాడరూరల్ : కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం కూచిపూడిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలపు శేషు, అనంతరామయ్య, సుందర్‌రావు, విజయ్‌భాస్కర్, వినయ్, తిరపతయ్య తదితరులు ఉన్నారు.

కొందరిలాగా మేము పన్నులు వసూలు చేయం : పద్మావతి

కోదాడ : నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నామని చెప్పుకుంటూ తాము పన్నులు వసూలు చేయమని, ప్రజలను వారి పని వారిని చేసుకోనీయకుండా వ్యాపారాల్లో జోక్యం చేసుకుంటూ అక్రమ వ్యాపారులను ప్రోత్సహిస్తూ ప్రతి దానికి కే..ఎం ట్యాక్స్ వసూలు చేస్తున్న వారిని ఇంటికి పంపాలని, నీతి నిజాయితీతో పని చేసేవారిని ఆదరించాలని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి కోరారు. గురువారం తెల్లవారు జామున కోదాడ బాలుర పాఠశాల, కట్టకొమ్ముగూడెం బైపాస్ చౌరస్తా వద్ద ఆమె మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా థియేటర్ సెంటర్‌లోని టీ సెంటర్ వద్ద టీ తయారు చేసి వాకర్స్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో పారా సీతయ్య, పాలూరి సత్యనారాయణ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

విశేషంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు గురువారం వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, మూలవిరాట్‌మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు మొదలుపెట్టారు. ముందుగా విశ్వక్సేనునిపూజ, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం ఆలయలో నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన



యాతవాకిళ్లలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల, కామంచికుంటతండా తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ మామిడి జానకిరాములు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలోని బూత్‌లలో వృద్ధులు, వికలాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఓట్లు వేసేందుకు సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోలింగ్ అధికారులకు, సిబ్బందికి సహకరించేందుకు పంచాయతీ సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. వారంతా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూస్తారని చెప్పారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు నరేష్, సరిత, బీఎల్‌ఓలు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్నికల బరిలో చిలుకూరు మండలం నుంచి ఆరుగురు

చిలుకూరు : ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా చిలుకూరు మండలానికి చెందిన ఆరుగురు బరిలో ఉన్నారు. కొండాపురంనకు చెందిన మెరిగ సైదులు ధర్మసమాజ్ పార్టీ నుంచి పోటీ చేస్తుండగా శీతల తండాకు చెందిన ఇస్లావత్ రవినాయక్ బ్లూ ఇండియన్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా చిలుకూరు నుండి కొల్లు లక్ష్మీనారాయణరావు, గుండు ఉపేందర్, మరీదు రామకృష్ణ, పోలేనిగూడెంకు చెందిన బాద శ్రీవిద్య పోటీలో ఉన్నారు. వీరికి గుర్తులు కేటాయించగా ప్రచారం చేస్తున్నారు.

నడిగూడెం నుంచి ముగ్గురు..

నడిగూడెం : ఈ నెల 30 జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ముగ్గురు నాయకులు నడిగూడెం మండలం నుంచి బరిలో ఉన్నారు. కరివిరాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నాలుగోసారి బరిలో ఉన్నారు. అలాగే సిరిపురం నుంచి షేక్.మస్తాన్ రెండోసారి బరిలో ఉన్నారు. బృందావనపురంనకు చెందిన విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ నవీన్ మొదటిసారిగా పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరామర్శ



లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జుట్టుకొండ సత్యనారాయణ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ ప్రథమ వర్ధంతి గురువారం జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళురిచ్చి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఆదెర్ల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్‌గౌడ్, గుండు రామాంజీగౌడ్, సీతారాంరెడ్డి, చాంద్‌మియా, చింతకాయల సైదులు, ధనమ్మ, బచ్చలకూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఉండే ఉత్తమ్ కావాలా.. మీ మధ్యే ఉండే నేను కావాలా?

- హుజూర్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి

గరిడేపల్లి : ఢిల్లీలో ఉండే ఉత్తమ్ కావాలో ప్రతినిత్యం ప్రజల మధ్య ఉండే సైదన్న కావాలో నిర్ణయించుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజలదేనని బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు అప్పన్నపేట, రామచంద్రాపురం, కోదండరాంపురం, ఎల్బీనగర్, అప్పిరెడ్డిగూడెం, లక్ష్మీపురం, సర్వారం, కొండాయిగూడెం, గానుగుబండ, కల్మలచెరువు, వెంకటరాంపురం, పొనుగోడు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, గట్టు శ్రీకాంత్‌రెడ్డి, రమణానాయక్, జిన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, కడియం వెంకట్‌రెడ్డి, గుగులోతు కృష్ణానాయక్, గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశానికే దిక్సూచిగా తెలంగాణ పథకాలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని బీఆర్ఎస్ నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం మండలంలోని మల్లారెడ్డిగూడెం, గుడిమల్కాపురం గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుతోనే తలరాతలు మారుతాయి

- బీఎస్పీ అభ్యర్థి రాపోలు నవీన్‌కుమార్

హుజూర్‌నగర్ : ఓటుతోనే ప్రజలు తమ తలరాతలు మార్చుకునే అవకాశం ఉందని బీఎస్పీ హుజూర్‌నగర్ అభ్యర్థి రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని జంగాలగూడెం కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జీవితాలు మారాలంటే ప్రజలు బహుజన సమాజ్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పి.ఉపేందర్, కె.నర్సింహారావు, జె.రామస్వామి, ఎం.మట్టపల్లి, ఎ.వెంకటేశ్వర్లు, వై.కృష్ణవేణి, వీరాంజనేయులు, పవన్, సురేష్‌బాబు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం, కుంచమర్తి, కొమ్మాల, కోడూరు, అడివెంల గ్రామాల్లో గురువారం పీఏసీఎస్, సెర్ప్, ఎన్‌డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం సందర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాల అమలు

మోతె : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు అమలవుతాయని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని అన్నారిగూడెం, ఉర్లుగొండ, మామిళ్లగూడెం, హుస్సేనాబాద్, కొత్తగూడెం, తుమ్మలపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నడిగూడెం మండల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతమొందించాలి

- హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలత

హుజూర్‌నగర్‌రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతమొందించాలని బీజేపీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి కోరారు. గురువారం మండలంలోని లింగగిరి, సీతారాంపురం, శ్రీనివాసపురం, లక్కవరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అవినీతే ధ్యేయంగా పనిస్తున్న సీఎం కేసీఆర్ పాలన కావాలో.. అవినీతి రహిత పాలన అందిస్తున్న మోదీ పాలన కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి, లక్ష్మీనారాయణ, వినోద్, శివకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత

- సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి

గరిడేపల్లి : నయా నవాబు మాదిరిగా దొరల పాలన సాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వం పట్ల అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత ఉందని సీపీఎం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని రాయినిగూడెం, మంగాపురం, కాల్వపల్లి, కీతవారిగూడెం, తాళ్లమల్కాపురం, కొత్తగూడెం, రంగాపురం, వెలిదండ, కొనాయిగూడెం, అగ్రహారం, గడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, పారేపల్లి శేఖర్‌రావు, యాదగిరిరావు, ములకలపల్లి రాములు, నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, డీవైఎఫ్ఐ నవీన్, మండల కార్యదర్శులు ఎస్కే యాకూబ్, అనంతు ప్రకాష్, శ్రీనివాస్, నగేష్, రాచమల్లు రామస్వామి, సర్పంచ్‌లు స్వరూప, భిక్షం, జ్యోతి, అర్జున్, సైదులు, శ్రీనివాస్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచించి మంచివైపు నిలబడాలి

హుజూర్‌నగర్ : ప్రజలు ఇకనైనా ఆలోచించి మంచివైపు నిలబడాలని ఏఐఎఫ్‌బీ పార్టీ అభ్యర్థి పిల్లుట్ల రఘు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో బీజేపీకి చెందిన పలువురు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీలో చేరారు. వారికి పిల్లుట్ల రఘు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని వివిధ వార్డులలో ప్రచారం నిర్వహించారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మణ్, ఉపేందర్, సోమరాజు, శివ, సాయి, నాగరాజు, కృష్ణ, విజయ్, కుమారి, సైదులు, మురళి, విజయ్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ కార్యకర్తలు, రఘు అభిమానులు, ఓజో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

సూర్యాపేట : మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై బీఆర్ఎస్ పార్టీ 40వ వార్డు కౌన్సిలర్ తాహెర్ పాషా వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు పిడమర్తి రేణుక నిరసన తెలిపి మాట్లాడారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని 40వ వార్డులో విధుల్లో భాగంగా చెత్త సేకరిస్తుండగా తాహెర్ పాషా అకారణంగా దూషించాడని చెప్పారు. చెత్త సేకరణ ట్రాక్టర్ డ్రైవర్‌ను సైతం దుర్భాషలాడాడని తెలిపా రు. అంతేకాకుండా పదిమంది పారిశుద్ధ్య కార్మికులను సెలవులు పెడుతున్నారనే కారణంతో విధుల నుంచి తొలగించారన్నారు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే మున్సిపల్ కమిషనర్ సంతకం పెట్టించుకుని రావాలని, ఆ తర్వాతనే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్తున్నారన్నారు. ఫిర్యాదు తీసుకోవాలని కోరారు.

రాజకీయ నాయకులుగా ఆకట్టుకున్న విద్యార్థులు



రాజకీయ నాయకుల వేషధారణలో చిన్నారులు

మోతె : మండల కేంద్రంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అధికారులు, రాజకీయ నాయకుల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గుండ్లపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



కోదాడఅర్బన్ : మాలధారులకు అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. మాలధారులతో పాటు ఇతర భక్తులకు కూడా దాతల సహకారంతో మకరజ్యోతి వరకు ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగించనున్నట్లు తెలిపారు. గురువారం అన్నదానానికి రావూరి రంగయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మి, కుమారుడు రవీంద్ర- శ్రావణిలు రూ.15,116ల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి శ్రీలక్ష్మి వేబ్రిడ్జి, నరమనేని రామారావు గురుస్వామి, లింగరాజు –సైదమ్మ దంపతులు సహకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు వల్లోజు వెంకన్న, కుందూరు పుల్లారెడ్డి, తంగెళ్ల సాంబ, సంజీవరెడ్డి, ఈదారావు, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, రాంబాబు, పెద్దవీరస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



మఠంపల్లి : పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీనియర్ నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రంలో వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం వారికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు స్రవంతి ఆదూరి కిషోర్‌రెడ్డి, కర్నె రమణావెంకటేశ్వర్లు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గాదెలూర్దుమరెడ్డి, వీరబాబు, జయభారత్‌రెడ్డి, మహేష్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దైదారాయల్, జయరాజు, విజయ, జ్యోతి, సంధ్య, నాగలక్ష్మి, కౌసల్య, గోపయ్య, నరసింహారావు, వీరయ్య, కృష్ణ, నాగయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కస్తాల వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, కాంగ్రెస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు

మఠంపల్లి: మండలంలోని పెదవీడు జెడ్పీహెచ్ఎస్‌లో ఆకతాయిలు చేస్తున్న అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవాలని స్థానిక సర్పంచ్ సయ్యద్ బీబీకుతుబ్, ఎస్ఎంసీ చైర్మన్ వీరయ్య గురువారం మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ఆకతాయిలు, మద్యం ప్రియులు సెలవు రోజుల తోపాటు, రాత్రివేళల్లో పాఠశాలలో మద్యం సేవించి సీసాలు పగులగొడుతున్నారన్నారు. బెంచీలు ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వీరిని గుర్తించి పోలీసులకు పట్టించామని, అయినా తిరిగి పునరావృతం అవుతున్నాయని తెలిపారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.